క్లుప్తంగా

నీటితీరువా వసూళ్లలో అలసత్వం వద్దు

చీరాల టౌన్: గ్రామాల్లో ఉన్న పంట పొలాలకు సంబంధించిన నీటి తీరువా వసూళ్లను నెలాఖరు కల్లా పూర్తి చేయడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలని తహసీల్దార్ కుర్రా గోపీకృష్ణ సూచించారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో గ్రామ, పట్టణ రెవెన్యూ అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లోన్న వ్యవసాయ భూములకు సంబంధించి నీటి తీరువా రూ.46 లక్షలు వసూళ్ల లక్ష్యంగా గ్రామ రెవెన్యూ అధికారులు పనులు చేయాలన్నారు. రెవెన్యూ ఉద్యోగులు, సిబ్బంది విధులను సక్రమంగా నిర్వహించాలన్నారు. ఆర్ఐలు శేఖర్, సత్యం, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

పీఎంజేఏవై ఈకేవైసీ

కారంచేడు: పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం పీఎంజేఏవై ఈకేవైసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు గోరంట్ల సురేష్ బాబు, డాక్టర్ పృథ్వీ రాజ్ మాట్లాడుతూ గ్రామంలో అందరూ పీఎంజేఏవై ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. పథకం ద్వారా ఆసుపత్రుల్లో ఉచితంగా వైద్యం పొందవచ్చని తెలిపారు. సర్పంచ్ బాలిగ శివపార్వతి, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

పశుబీమా సద్వినియోగం చేసుకోండి

బల్లికురవ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్త సహకారంతో పశుసంవర్ధక శాఖ ద్వారా అమలు చేస్తున్న పశుబీమాను రైతులు సద్వినియోగ పరుచుకోవాలని మండల పశువైద్యాధికారి పి. మహేశ్వరరావు మంగళవారం తెలిపారు. ఒక్కో పాడి పశువుకు రూ. 15 వేల నుంచి రూ.1 లక్ష వరకు విలువను బట్టి ప్రీమియం చెల్లించవచ్చన్నారు.

భిక్షాటనతో ఇంజినీరింగ్ కార్మికుల నిరసన

అద్దంకి: తమ సమస్యల కోసం ఇంజినీరింగ్ కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మె మంగళవారానికి మూడో రోజుకు చేరింది. మూడో కార్యక్రమంలో భాగంగా కార్మికులు వీధుల్లో భిక్షాటన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం తమ డిమాండ్లు నెరవేర్చకుంటే తమకు పట్టబోయే దుస్థితి ఇదేనని చెప్పారు.

మత్తుతో జీవితాలు చిత్తు

పర్చూరు(చినగంజాం): విద్యార్థి దశలో మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలను పాడు చేసుకోవద్దని పర్చూరు ఎస్ఐ జీవీ చౌదరి సూచించారు. మంగళవారం పర్చూరు జూనియర్ కాలేజీలో విద్యార్థులకు మత్తు పదార్థాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బాల్యంలో విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టాలని, జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదిగేందుకు కృషి చేయాలని, ప్రతి ఒక్కరూ ఉన్నతమైన జీవితాలను గడిపేందుకు కృషి చేయాలని సూచించారు. మత్తు పదార్థాలు, సిగరెట్లు, మద్యం వంటి చెడు వ్యసనాలకు లోను కాకుండా జీవితాన్ని ఆనందంగా గడిపేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. కళాశాల సిబ్బంది, పోలీస్ సిబ్బందితో పాటు జిల్లా ఈగల్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ ఉండాలి

కారంచేడు: విద్యార్థి దశ నుంచే విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలని కారంచేడు ఎస్ఐ ఎస్కే ఖాదర్ బాషా అన్నారు. మంగళవారం కారంచేడు గ్రామంలోని హైస్కూల్లో విద్యార్థులకు మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు మత్తు పదార్థాలు జోలికి పోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, చిన్నవయస్సులో మద్యం, సిగరెట్, మత్తు పదార్థాల గురించి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

పరిసరాల పరిశుభ్రత అవసరం

చీరాల టౌన్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం సామాజిక బాధ్యతని, వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఈపురుపాలెం పంచాయతీ సెక్రటరీ మురళీ బాపూజీ అన్నారు. మంగళవారం ఈపురుపాలెంలో బ్లీచింగ్ చల్లించారు. జనావాసాల మధ్య చెత్త కుప్పలను నిల్వ చేయకూడదన్నారు.

మధ్యవర్తిత్వం ద్వారా కేసుల పరిష్కారం



కిలో మీటర్ల వాక్‌లో పాల్గొన్న న్యాయమూర్తులు, న్యాయవాదులు, పోలీసులు

చీరాల రూరల్: దీర్ఘకాలంగా కోర్టుల్లో ఉన్న పెండింగ్ కేసులను మధ్యవర్తిత్వం (మీడియేషన్) ద్వారా పరిష్కరించుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి ఎం. సుధ పేర్కొన్నారు. మీడియేషన్‌పై ప్రజలకు అవగాహన కార్యక్రమంలో భాగంగా మండల న్యాయ సేవాధికార సంస్థ చీరాల ఆధ్వర్యంలో 1 కిలో మీటర్ వాక్ నిర్వహించారు. మంగళవారం స్థానిక కోర్టు భవన సముదాయాల నుంచి న్యాయమూర్తులు, న్యాయవాదులు, పోలీసులు పాల్గొనగా ర్యాలీని న్యాయమూర్తి సుధ పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు సీనియర్ సివిల్ జడ్జి ఎం. సుధ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వెంకట వాహిని, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కాత్యాయని, డీఎస్పీ మొయిన్‌లు మాట్లాడారు. వన్ టౌన్ సీఐ సుబ్బారావు, టూటౌన్ సీఐ నాగభూషణం, ఎస్సైలు, బార్ అసోసియేషన్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు గౌరవ రమేష్‌బాబు, బండ్లమూడి విజయకుమార్, ఏజీపీ బోయిన రమేష్‌బాబు పాల్గొన్నారు.



ఇంకొల్లు: రైతులకు వ్యవసాయ మందులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ లుథియమ్మ



వేటపాలెం: మాట్లాడుతున్న ఏఓ సరిత

విత్తన శుద్ధితో తెగుళ్ల నివారణ

వేటపాలెం: రైతులు వరి నారుమళ్లు పోసుకొనే ముందు తప్పని సరిగా విత్తన శుద్ధి చేసు కోవాలని మండల వ్యవసాయ అధికారి ఎం. సరిత సూచించారు. మండల పరిధిలోని దేశాయిపేట 1, కొత్తపేట-1 రైతు సేవా కేంద్రాల పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ముందుగా రైతులు సాగు చేసిన వరి నారుమళ్లను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో ఏఓ పలు సూచనలు చేశారు. నారుమళ్లు పోసుకొనే ముందు విత్తన శుద్ధి అత్యంత కీలకంగా పని చేస్తుందని తెలిపారు. రైతులు మంచి విత్తనాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. విత్తనాలు కొనే ముందు వాటి మొలక శాతాన్ని తప్పని సరిగా చూడాలని కోరారు. విత్తనాలు కొన్న దుకాణం వద్ద తప్పని సరిగా రసీదు తసుకోవాలన్నారు. వరి సాగుకు ముందు పొలాన్ని సాగుకు అనువుగా ఉండే విధంగా దున్ని సిద్ధం చేసుకోవాలన్నారు. కలుపు నివారణ పద్ధతుల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈఓ ఎం. గోపికృష్ణ, మనీషా రైతులు పాల్గొన్నారు.

జె.పంగులూరు: గ్రామంలో మంగళవారం ఏఓ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పంట నమోదు చేయించడం వల్ల ఎన్నో ఉపయోగాలు ఉంటాయన్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు నష్టపరిహారం పొందడానికి, క్రాప్ ఇన్సూరెన్స్ చేయించుకోవడం వలన రైతులు పండించిన పంటను అమ్ముకొనేందుకు వీలుగా ఉంటుందని తెలిపారు. గ్రామంలో కౌలు పొలం వేస్తున్న ప్రతి రైతు గుర్తింపు కార్డు తప్పనిసరిగా తీసుకోవాలని కోరారు. కౌలు గుర్తింపు కార్డు తీసుకున్న రైతులు గ్రూపులుగా ఏర్పడి బ్యాంకులో పంటరుణాలు పొందేందుకు వీలుపడుతుందని తెలిపారు. ప్రధాన మంత్రి పసల్ బీమా కింద మినుము, పెసర, కంది పంటలకు జూలై 30 లోపు, వరి పంటకు ఆగస్టు 15 లోపు బ్యాంకు లోను తీసుకునే వెసులుబాటు ఉందని తెలిపారు. మీ సేవా కేంద్రాల్లో ప్రీమియం చెల్లించవలసిందిగా వ్యవసాయ శాఖ అధికారి డి. సుబ్బారెడి కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డి. అమృత రైతులు పాల్గొన్నారు.



పంగులూరులో మాట్లాడుతున్న ఏఓ సుబ్బారెడ్డి

ఇంకొల్లు(చినగంజాం): పత్తి రైతులు తప్పనిసరిగా విత్తన శుద్ధి చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎన్. మేరిమ్మ సూచించారు. పావులూరు, నక్కలపాలెంలో మంగళవారం మాట్లాడారు. విత్తుకునే ముందు ఒక కిలో విత్తనాలకు 10 గ్రాములు ట్రైకోడర్మావిరిడి, 5 గ్రాములు సూడోమోనాస్‌తో విత్తనశుద్ధి చేసుకుంటే ఎండు తెగులును నివారించుకోవచ్చని తెలిపారు. ఎకరా పొలానికి రూ. 1800 బీమా చేసుకోవాలన్నారు. ప్రతి పంట నష్ట పోతే రూ. 38 వేలు ఒక ఎకరానికి అందజేస్తారని తెలిపారు. పావులూరు సర్పంచ్ బి. లుధియమ్మ, వ్యవసాయ సహాయ అధికారి వినయ్ కుమార్ పాల్గొన్నారు.

కారంచేడు: లైసెన్స్ కలిగిన డీలర్ల వద్దనే రైతులు విత్తనాలు కొనుగోలు చేయాలని పర్చూరు వ్యవసాయ సహాయ సంచాలకులు జీబీపీ ప్రవీణ సూచించారు. బిల్లులను పంట కాలం అయిపోయేంత వరకు భద్రపరచు కోవాలని సూచించారు. ఎక్కువ పొలం కలిగిన రైతులు ఒకే పంటను సాగు చేయకుండా పలు రకాల పంటలు సాగు చేయాలని తెలియజేశారు. వ్యవసాయాధికారి ఎం. నాగరాజు, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

బల్లికురవ: పంటల సాగులో రైతులు నాణ్యత కలిగిన మేలైన విత్తనాలు ఎంపిక చేసుకోవాలని వ్యవసాయాధికారి పి. శ్రీనివాసరావు కోరారు. మంగళవారం కొప్పరపాడులో మాట్లాడారు. ఏఈవో మౌలాలి, వీఏఏ పవన్, పాల్గొన్నారు.

యద్దనపూడి: కౌలు రైతులు తప్పనిసరిగా కౌలు కార్డులు పొందాలని మండల వ్యవసాయాధికారి ఎస్‌వీపీ కుమారి అన్నారు. మంగళవారం జాగర్లమూడి, పెద్దివారిపాలెంలో పలు సూచనలు చేశారు. పొగాకు కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకునే రైతులు షెడ్యూల్‌లో చూపిన తేదీ ప్రకారం తీసుకు వెళ్లాలని, తేమ శాతం 20 శాతం కన్నా తక్కువ ఉండేలా చూసుకోవాలన్నారు. ఏఈఓ మధుప్రియ, రైతులు పాల్గొన్నారు.



కారంచేడు: రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ సహాయ సంచాలకులు ప్రవీణ



కొప్పరపాడు రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి



యద్దనపూడి: రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారి కుమారి

క్రీడా పరికరాల పంపిణీ

పర్చూరు(చినగంజాం): ఏఎన్ అండ్ వీఎస్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు రోటరీ క్లబ్ ఆఫ్ పర్చూరు సెంట్రల్ ఆధ్వర్యంలో మంగళవారం రూ. 10 వేలు విలువ కలిగిన క్రీడా పరికరాలు అందజేశారు. రొటేరియన్ నాగభైరు శ్రీనివాసరావు మనవడు దండా దేవాన్ష్ 8వ పుట్టిన రోజు పురస్కరించుకొని పాఠశాలకు క్రీడా పరికరాలు అందజేశారు. తోకల కృష్ణమోహన్ మాట్లాడుతూ పాఠశాలకు అవసరమైన సదుపాయాలు సమకూరుస్తామన్నారు. సీనియర్ సభ్యులు కేఎస్ఆర్‌కే ప్రసాద్ మాట్లాడుతూ పాఠశాల క్లబ్‌కు ఎంతో ముఖ్యమైనదని పాఠశాలకు అనేక వసతులు కల్పిస్తున్నామని భవిష్యత్‌లో కూడా పాఠశాలకు అవసరమైన వసతులు అందజేస్తామని తెలియజేశారు. కోమటి ఆంజనేయులు, సభ్యులు కోట శ్రీనివాసరావు, కొల్లా సుబ్బారావు, కాసా అశోక్ కుమార్, హెచ్ఎం అవని, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థినులకు క్రీడా పరికరాలు అందజేస్తున్న రోటేరియన్‌లు

సైకిళ్లు పంపిణీ చేసిన మంత్రి



సైకిళ్లను పంపిణీ చేస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

సంతమాగులూరు(అద్దంకి): మండలంలోని వెల్లలచెరువు గ్రామంలో మంగళవారం పరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ హాజరయ్యారు. దానిలో భాగంగా రూ.30 లక్షల ఎంజీఎన్ఆర్ఎస్ నిధులతో నిర్మించిన సీసీ రహదారులను ప్రారంభించారు. అనంతరం గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లోని 137 మందికి సైకిళ్లను పంపిణీ చేశారు. అధికారులు, నాయకులు, పాల్గొన్నారు.

సాంబిరెడ్డి సేవలు మరువలేనివి

అద్దంకి: గ్రామ సర్పంచ్‌గా ఉప్పులూరి సాంబిరెడ్డి రామాయపాలెం గ్రామానికి అందించిన సేవలు మరువలేనివని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు జ్యోతి హనుమంతరావు అన్నారు. మంగళవారం పానెం చిన హనిమిరెడ్డి సోదరులు పానెం నరసింహారెడ్డి, శ్రీనివాసరెడ్డిలతో కలిసి రామయపాలెంలోని సాంబిరెడ్డి గృహానికి వెళ్లారు. సాంబిరెడ్డి భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. నరసింహారెడ్డి మాట్లాడుతూ సాంబిరెడ్డి మరణం పార్టీకి తీరని లోటన్నారు. గ్రామంలోని వారికి, ఇటు పార్టీకి ఆయన సేసిన సేవలను కొనియాడారు. తరువాత అశ్రు నయనాలనతో భౌతిక కాయాన్ని మరుభూమికి సాగనంపారు.



పూలమాల వేస్తున్న జ్యోతి హనుమంతరావు పానెం సోదరులు

కుర్రవానిపాలెం అధ్యక్షునికి సన్మానం



సుబ్బారావును సన్మానిస్తున్న పాలపర్తి శ్రీధర్

మేదరమెట్ల: కొరిశపాడు మండలం కుర్రవానిపాలెం గ్రామ వైఎస్సార్‌సీపీ అధ్యక్షునిగా నియమితులైన కొత్తపల్లి సుబ్బారావును మండల పార్టీ కన్వీనర్ పాలపర్తి శ్రీధర్ మంగళవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జేసీఎస్ ఇన్‌చార్జి మామిళ్లపల్లి వేణు, మండల పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు నూకతోటి అశోక్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చకుండా అక్రమ కేసులా?



జమ్ములమడక కాలనీలో ఎంపిక చేసిన గ్రామ, బూత్ కమిటీలతో కృష్ణబాబు



కొప్పరపాడులో ఎంపికచేసిన గ్రామ, బూత్ కమిటీ సభ్యులతో కృష్ణబాబు

● వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్

బల్లికురవ: కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు అవుతున్నా ఎన్నికల హామీలు నెరవేర్చకుండా రెడ్ బుక్ రాజ్యాంగంలో అక్రమ కేసులతో రోజురోజుకు దాడులు చేస్తున్నారని.. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దేవినేని కృష్ణబాబు అన్నారు. మంగళవారం మండలంలోని జమ్ముల మడక కాలనీ, కొప్పరపాడు గ్రామ, బూత్ కమిటీలను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. కూటమి వైఫల్యాలను ఎండగట్టేందుకు గ్రామ, బూత్ కమిటీల ఎంపికతో పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. బాబు సర్కార్ కార్పొరేషన్ శక్తుల ప్రయోజనాల కోసం ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని గుడిపాడు, కుందుర్రు, మావిళ్లపల్లి, మక్కెనవారిపాలెం, కరేడులో వేలాది ఎకరాలు భూసేకరణతో సోలార్ ప్రాజెక్టు, ఇండోసోల్ కంపెనీకి కట్టబెట్టాలని చూస్తోందన్నారు. రైతులకు అన్యాయం చేసే తమ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చూస్తూ ఊరుకోరని కృష్ణబాబు అన్నారు. కరేడు రైతులు జగనన్నను కలిసినట్లు కూడా చెప్పారు. జమ్ములమడక కాలనీ గ్రామ, బూత్ కమిటీల అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా నూనె ప్రభుదాస్, దేవదాస్, గద్దల మరియబాబు, నూనె ఆత్మారావు ఎంపిక చేశారు. అలాగే కొప్పరపాడు గ్రామ కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా బండారు నాగయ్య, పందిరి పెద్దబ్బాయి, బూత్ కమిటీ అధ్యక్ష, ఉపాధక్షులుగా టీఎం శ్రీనివాసరావు, గజ్జల నెహేమియాను ఎంపిక చేశారు.

బయో రిసోర్స్ సెంటర్ ప్రారంభం



కోలలపూడిలో బయో రిసోర్స్ సెంటర్ ప్రారంభిస్తున్న అధికారులు

మార్టూరు: రసాయనరహిత ప్రకృతి సేద్యాన్ని ప్రతి గడపకు పరిచయం చేయటం ద్వారా ప్రజలకు ఆరోగ్యకరమైన పంటలు, కూరగాయలు అందుబాటులోనికి తీసుకురావాలని బాపట్ల జిల్లా న్యాచురల్ ఫార్మింగ్ డీపీఎం సయ్యద్ అక్తర్ హుస్సేన్ పిలుపునిచ్చారు. కోలలపూడిలో మంగళవారం వ్యవసాయ శాఖ ఏవో లావణ్యతో కలిసి ప్రకృతి సేద్యానికి అవసరమైన కషాయాలతో కూడిన బయో రిసోర్స్ సెంటర్ ఖించారు. పెరటి తోటలు, టెర్రస్ గార్డెన్స్ ద్వారా ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన ఆహారాన్ని పొందగలుగుతారన్నారు. బలగాని కోటేశ్వరమ్మ నివాసంలో బయో రిసోర్స్ సెంటర్ ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎం. సతీష్ కుమార్, నేచురల్ ఫార్మింగ్ అడిషనల్ డీపీఎం మోహన్, మండల అధికారి రాజశేఖర్, యూనిట్ ఇన్‌చార్జ్ రెహమాన్ శివశంకర్, సుధాకర్ స్థానిక రైతులు పాల్గొన్నారు.

సీఆర్పీ కుటుంబానికి ఆర్థిక సాయం

జె.పంగులూరు: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సీఆర్పీ మట్టకొయ్య మోషే కుటుంబ సభ్యులకు మండల ఉపాధ్యాయులు సహకారంతో మంగళవారం రూ. 1.15 లక్షల ఆర్థిక సాయం చేశారు. ఉపాధ్యాయులు సమకూర్చిన ఈ సొమ్మును రేణింగవరంలోని ఎంఈఓ నాగభూషణం చేతుల మీదుగా అందించారు. ఉపాధ్యాయులు కంకణాల శ్రీను, సీహెచ్ చెంచురామారావు, యేడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

వినికిడి యంత్రాలతో భవిత

అద్దంకి: వినికిడి లేని ప్రత్యేకావసరాల పిల్లలకు వినికిడి యంత్రాలతో భవిష్యత్తు బాగుంటుందని చీరాల ఉప విద్యాశాఖాధికారి గంగాధరరావు అన్నారు. స్థానిక అద్దంకి భవిత కేంద్రంలోని ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు 27 మందికి మంగళవారం, అద్దంకి మండల ఇంచార్జ్ విద్యాశాఖాధికారి 2 అనంతు శ్రీనివాసరావుతో కలిసి, ఉపకరణాలు పంపిణీ చేశారు. 24 మందికి వినికిడి యంత్రాలు, ముగ్గురికి విడివిడిగా వీల్ చైర్, సీపీ చైర్, ట్రై సైకిల్ అందజేశారు. కార్యక్రమంలో ఐఈఆర్‌టీ ఉపాధ్యాయులు కొంగల శ్రీనివాసు, పొలపర్తి యోనా, చైతన్య బధిరుల పాఠశాల ప్రిన్సిపాల్ పి. సురేంద్రబాబు, హెచ్ఎం జె.బాబురావు పాల్గొన్నారు.



ఉపకరణాలు పంపిణీ చేస్తున్న ఉప విద్యాశాఖాధికారి

యూనిట్‌ల పర్యవేక్షణ తప్పనిసరి

వేటపాలెం: వర్మీ కంపోస్ట్ యూనిట్‌ల పర్యవేక్షణ సక్రమంగా నిర్వహించాలని డీఎల్‌డీఓ పద్మావతి ఆదేశించారు. కొత్తపేటలో వర్మీ కంపోస్టు యూనిట్‌ను డీఎల్‌డీఓ మంగళవారం పరిశీలించారు. గ్రామాల్లో సేకరించిన తడి చెత్త పొడి చెత్తను వేరువేరుగా ఉండేలా చూడాలని కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి సూచించారు. ఎంపీడీఓ ఎం. రాజేష్ బాబు, ఏ. శ్రీనివాసరావు, సెక్రటరీ టి. వెంటేశ్వరరావు పాల్గొన్నారు.



వర్మీ కంపోస్టు యూనిట్‌ని పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ పద్మావతి

ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్‌ల వితరణ

ఇంకొల్లు(చినగంజాం): చీమకుర్తిలోని మిడ్‌వెస్ట్ గ్రానైట్ లిమిటెడ్ సంస్థ తన కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు 59 ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్‌లను అందజేసింది. బాపట్ల జిల్లా వైద్యాధికారుల సహకారంతో బాపట్ల జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు పర్చూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్, చీరాల, బాపట్లలోని ఏరియా హాస్పిటల్స్‌కు పంపిణీ చేశారు. వీటిలో 43 యూనిట్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు, మిగిలిన 16 యూనిట్‌లు పర్చూరు, చీరాల, బాపట్ల ఆసుపత్రులకు పంపిణీ చేశారు. ఇంకొల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి టి. అంజలి మాట్లాడుతూ ప్రజలకు తక్షణ సేవలందించేందుకు వీలవుతుందన్నారు.



ఇంకొల్లులో ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్‌లను అందుకుంటున్న వైద్యాధికారి, సిబ్బంది

విద్యతో పాటు చేతి వృత్తులు అవసరం

జె.పంగులూరు: విద్యార్థులు విద్యతోపాటు చేతి వృతులు నేర్చుకోవాలని రిటైల్ ట్రేడ్ ట్రైనర్ గంగాప్రసాద్, రవీంద్ర వెల్లడించారు. మండల పరిధిలోని కొండమంజులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రపంచ యూత్ స్కిల్ డే కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వంచే అందించిన ఆటోమెటివ్ పరికరాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం శ్రీమతి ఐ. అనిత మాట్లాడుతూ చదువుతో పాటు యువత నైపుణ్యాలు పెంపొందించటానికి ప్రతి సంవత్సరం జూలై 15వ తేదీని ప్రపంచ యూత్ నైపుణ్య దినంగా నిర్వహిస్తారన్నారు. ఈ సంవత్సరం ఏఐ, డిజిటల్ టెక్నాలజీ నిర్వహిస్తున్నారని విద్యార్థులంతా పాఠశాలలో ఉన్న ఒకేషనల్ శిక్షణ పొంది నైపుణ్యాలను పెంచుకోవాలని తెలిపారు.



చేతివృత్తి పరికరాలను ప్రదర్శిస్తున్న దృశ్యం

గ్రామ కమిటీల ఏర్పాటు

జె.పంగులూరు: మండల పరిధిలోని 21 గ్రామాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు అందరినీ కలుపుకొని ప్రతి గ్రామంలో గ్రామ కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు మండల కన్వీనర్ రావూరి శ్రీనివాసరావు అన్నారు. మండల పరిధిలోని చిన్నమల్లవరంలో మంగళవారం గ్రామ కమిటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చిన్నమల్లవరం గ్రామ పార్టీ అధ్యక్షునిగా తలతోటి బ్రహ్మయ్యను ఎంపిక చేశామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు జంపాని రాజా, మంద పుషోత్తం, చిలుకూరి వీరయ్య, తొటెంపూడి ఆదినారాయణ పాల్గొన్నారు.



బ్రహ్మయ్యను అభినందిస్తున్న కన్వీనర్ శ్రీనివాసరావు

శక్తి యాప్‌తో సామాజిక రక్షణ



పంగులూరు: శక్తియాప్‌పై అవగాహన కల్పిస్తున్న పోలీసులు



మేదరమెట్లలో యాప్ బ్రోచర్ ఆవిష్కరిస్తున్న పోలీసులు

జె.పంగులూరు: ఆన్‌లైన్ మోసాలు, వ్యక్తిగత సమాచారం చౌర్యం, సోషల్ మీడియా ద్వారా మానసిక వేధింపులు వంటి అంశాలపై వివరించడంతో పాటు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై వినోద్‌బాబు అన్నారు. ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు, చీరాల డీఎస్పీ మొయిన్ పర్యవేక్షణలో ఎస్సై హరిబాబు ఆధ్వర్యంలో, శక్తి బృదం సభ్యులు శక్తి యాప్‌పై అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. చందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో వక్తలు మాట్లాడారు. శక్తి యాప్ డైన్‌లోడ్ చేసుకునే విధానాన్ని, యాప్ వలన కలిగే ప్రయోజనాలు వివరించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ లపై అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి గిరిజ, చీరాల శక్తి బృందం సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మేదరమెట్ల: ప్రతి ఒక్కరూ శక్తి యాప్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జునరావు అన్నారు. మేదరమెట్ల సెయింట్ ఆర్నాల్డ్స్ హైస్కూల్‌లో మంగళవారం అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళల భద్రతకు ఈ యాప్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. మేదరమెట్ల, చీరాల ఎస్‌ఐలు మహ్మద్ రఫీ, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.